# సాక్షి అనకాపల్లి

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024






నమస్తే అక్కా : ఇసుకతోట వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్




బంగారు కొండవయ్యా.. మా జగన్ మావయ్యా..





విశాఖ కంచరపాలెం వద్ద జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

గోపాలపట్నం వద్ద మేమంతా సిద్ధం అంటున్న జనం



# సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే వెన్ను తట్టే..!

- జనజాతరతో హోరెత్తిన విశాఖ నగరం
- అడుగడుగునా నీరా'జనం'.. దారిపొడవునా స్వాగతం
- సాగరతీరంలో మార్మోగిన జై జగన్ నినాదం
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం జగన్
- ఎండకు సైతం వెరవని అభిమానం
- ఉత్సాహంగా సాగిన బస్సుయాత్ర



**మండుటెండ.. అయినా భయపడలేదు.. కారుమబ్బులు.. అయినా కదలలేదు.. చిరుచీకట్లు.. అయినా వెరవలేదు..** అదే అభిమానం.. అదే ఆదరణ.. ఓ నాయకుడి జైత్రయాత్రకు విశాఖ నగరం సాక్ష్యంగా నిలిచింది. అభిమానం అంటే ఇలా ఉంటుందా? జనమంతా ఏకమై సంబరం చేస్తే ఇంత సందడిగా ఉంటుందా.? అన్నట్లుగా నగరంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర సాగింది. సంక్షేమం, అభివృద్ధితో జనహృదిని గెలుచుకున్న **ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాగరతీరంలో జన సముద్రం అంబరమంత స్వాగతం పలికింది. జై జగన్ నినాదాలతో సాగర ఘోషను** మించి విశాఖ నగరం ప్రతిధ్వనించింది. సీఎం జగన్ బాధలతో కలిసిన వారికి భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్నవారి కన్నీళ్లు తుడిచారు. సంతోషంతో వచ్చిన వారితో సందడి చేశారు. సుమారు 45 కిలోమీటర్ల మేర అభిమానంతో వచ్చిన జనసందోహాన్ని చిరునవ్వుతో పలకరించి.. అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

సాక్షి, విశాఖపట్నం:

జనమే జనం.. పోటెత్తిన అభిమాన ప్రవాహం.. కిక్కిరిసిన రహదారులు.. రోడ్లకిరువైపులా జనం బారులు.. మహిళల హారతులు.. పూల వర్షాలతో కనీవినీ ఎరుగని అఖండ స్వాగతం నడుమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆదివారం విశాఖ నగరంలో 45 కిలోమీటర్ల మేర సాగింది. సంక్షేమ రథసారథి, పేదల పెన్నిధి, తమకు మంచి చేసిన జననేతను స్వయంగా చూసేందుకు పెద్దల నుంచి పిల్లల దాకా ప్రతి ఒక్కరూ మండుటెండను సైతం లెక్క చేయకుండా వెల్లువలా తరలివచ్చారు. అభిమాన నేతను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే మాట్లాడాలని.. ఒక్క ఫొటో తీసుకోవాలని ఉత్సాహం చూపారు. తన కోసం వేచి చూస్తున్న అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సు దిగి ఆప్యాయంగా పలకరించారు. వారి కష్టాలు తెలుసుకుని 'నేనున్నానంటూ' భరోసా కల్పించారు. సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర.. ఎండాడలో ముగిసింది.

**పినగాడిలో పోటెత్తిన అభిమానం**

పెందుర్తి నియోజకవర్గం పినగాడి జంక్షన్‌లో జాతీయ రహదారి నిండిపోయింది. కాన్వాయ్ కదిలేందుకు కూడా వీలులేకుండా జనం సీఎం జగన్‌కు జేజేలు పలికేందుకు బారులు తీరారు. అభిమానంతో ఉరకలెత్తుతున్న ప్రజలను చూసి బస్సు దిగిన వైఎస్ జగన్.. జనానికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వగ్రామమైన శ్రీరాంపురంలో మహిళలు సీఎం జగన్‌కు దిష్టి తీశారు.

**వేపగుంటలో జన వర్షం**

వేపగుంటకు చేరుకున్నాక బస్సుయాత్ర.. జైత్రయాత్రలా మారింది. లక్ష్మీపురం నుంచి వేపగుంట జంక్షన్ నలువైపులా.. జయహో జగన్ అంటూ అభిమానులు.. జగనన్నా అంటూ మహిళలు.. సీఎం సీఎం అంటూ యువత కేరింతల నడుమ యాత్ర సాగింది. బస్సుపైకెక్కిన వైఎస్ జగన్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడి నుంచి గోపాలపట్నం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎటు చూసినా జన సందోహమే కనిపించింది. మిట్ట మధ్యాహ్నం నడినెత్తిన సూరీడు భయపెట్టిస్తున్నా.. జనం కదలకుండా జగన్‌ని చూసిన తర్వాతే వెళ్లారు.

**అభిమానంతో జంక్షన్ జామ్**

పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం రైతు బజారు వద్ద మధ్యాహ్నం 1.15 గంటలకు లంచ్ విరామం తీసుకున్నారు. సాయంత్రం 3.30 గంటలకు మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో మొదలైంది. మేమంతా సిద్ధం కటౌట్లతో ప్రజలు సీఎం రాకకోసం ఎదురు చూశారు. బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు రెండు వైపులా రహదారులు, దుకాణాల వద్ద సంక్షేమ ప్రదాతను చూసేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. అప్పటివరకు భయపెట్టిన ఎండవేడి నుంచి ఉపశమనం దక్కడంతో జనం మరింతగా పోటెత్తారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ వినూత్నంగా సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. కరాసాలో క్రేన్ ద్వారా భారీ కటౌట్‌ను గాల్లో ఉంచుతూ సీఎంకు స్వాగతించారు.

**'ఉత్తరం' ఉప్పొంగింది**

**ఉత్తర నియోజకవర్గంలోకి** రాగానే జన ప్రభంజనం **వెల్లువెత్తింది. ఊర్వశి జంక్షన్** నుంచి కంచరపాలెం **వరకూ మానవహారంలా** జనం రోడ్డుకిరువైపులా **బారులు తీరి.. ముఖ్యమంత్రి**కి ఘన స్వాగతం పలి**కారు. బస్సుపైకెక్కి సుమారు** 4 కిలోమీటర్ల మేర **ప్రతి ఒక్కరికీ సీఎం జగన్** అభివాదం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ యువత ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపింది. 2019లో ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా కంచరపాలెం మెట్టు వద్ద జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే తరహాలో కంచరపాలెం మెట్టు కిక్కిరిసిపోయింది. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో 101 గుమ్మడికాయలతో సీఎం జగన్‌కు దిష్టి తీశారు.

**'దక్షిణం' దద్దరిల్లింది**

తాటిచెట్లపాలెం మీదుగా దక్షిణ నియోజకవర్గంలోని రైల్వే న్యూకాలనీలోకి బస్సుయాత్ర అడుగుపెట్టింది. సీఎం జగన్ రాకతో వెల్లువలా తరలివచ్చిన ప్రజలతో దక్షిణం దద్దరిల్లిపోయింది. దొండపర్తి జంక్షన్ నుంచి ప్రజలకు సీఎం జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మేళతాళాలు, నృత్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పువాయిద్యాలతో దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సీఎంకు స్వాగతం పలికారు. అక్కయ్యపాలెం మీదుగా సత్యం జంక్షన్, మద్దిలపాలెం మీదుగా సాగిన యాత్రలో అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు.

**తూర్పులో జనసాగరం**

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. వాహనమిత్రతో లబ్ధి పొందిన సుమారు 500 మంది ఆటోడ్రైవర్లు సీఎం జగన్‌పై అభిమానాన్ని చాటుకుంటూ 'ఆటో హారం'తో స్వాగతం చెప్పారు. బాణసంచా మిరుమిట్ల మధ్య తూర్పులో యాత్ర వైభవంగా సాగింది. ఇసుకతోట, ఎంవీపీ కాలనీ, హనుమంతువాక, ఆరిలోవ ప్రాంతాల్లో ఎటు చూసినా జగన్ నామస్మరణే వినిపించింది. ముఖ్యమంత్రిని చూసేందుకు కుటుంబాలతో కలిసి ప్రజలు రోడ్లపైకి వచ్చి.. మురిసిపోయారు.



పినగాడి వద్ద సీఎం జగన్ అభివాదం

**భీమిలి నియోజకవర్గంలో రాత్రి బస**

హనుమంతువాక మీదుగా విశాఖ వ్యాలీ జంక్షన్, జూపార్క్, మధురవాడ ఎండాడ వరకు బస్సు యాత్ర సాగింది. వైఎస్ రాజశేఖర రెడ్డి క్రికెట్ స్టేడియం సమీపంలో రాత్రి బస పాయింట్‌కు చేరుకుంది. ఇక్కడ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. ఎంపీ అభ్యర్థులు బొత్స ఝాన్సీ, బూడి ముత్యాలనాయుడు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బస్సు యాత్రలో పాల్గొన్నారు.



అన్నొచ్చిండు : వేపగుంట వద్ద సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో యువత కేరింత



తీపి గుర్తు: చిన్నారికి ఆటోగ్రాఫ్



ఆత్మీయ స్పర్శ: వృద్ధురాలికి పలకరింపు





అభాగ్యులకు అండగా.. దివ్యాంగ బాలల సమస్య విని వారికి భరోసా ఇస్తున్న సీఎం జగన్

## ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

**తాటిచెట్లపాలెం (విశాఖ):** ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వాల్తేర్ డివిజన్ పరిధిలో రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**వివరాలిలా..**

- సంత్రగచ్చి–ఎస్ఎంవీ బెంగళూరు(08845) స్పెషల్ రైలు ప్రతి శుక్రవారం సంత్రగచ్చిలో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 9.02 గంటలకు బయలుదేరి ఆదివారాల్లో తెల్లవారు 2 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు–సంత్రగచ్చి(08846) స్పెషల్ ఎస్ఎంవీ బెంగళూరులో ప్రతి ఆదివారం తెల్లవారు 3.15 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.55 గంటలకు దువ్వాడ చేరుకుని.. అక్కడి నుంచి 8.57 గంటలకు బయలుదేరి సోమవారాల్లో ఉదయం 10.45 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు జూన్ 28 వరకు నడుస్తాయి.
- కోయంబత్తూర్–బరౌని (06059) స్పెషల్ రైలు ప్రతి మంగళవారం కోయంబత్తూర్‌లో ఉదయం 11.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని, 10.50 గంటలకు బయలుదేరి మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 25 వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో బరౌని–కోయంబత్తూర్(06060) స్పెషల్ బరౌనిలో ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మూడో రోజు తెల్లవారు 3.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 3.50 గంటలకు బయలుదేరి నాలుగో రోజు తెల్లవారు 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 28 వరకు నడుస్తుంది.

## బీజేపీ నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘన



బీజేపీ నాయకులు పంపిణీ చేసిన బీజేపీ గుర్తు, అభ్యర్థి బొమ్మతో కూడిన టీషర్టు

- పార్టీ గుర్తు, సీఎం రమేష్ ఫొటోతో టీ షర్ట్‌ల పంపిణీ

**దేవరాపల్లి :** దేవరాపల్లిలో బీజేపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. మండల కేంద్రం దేవరాపల్లిలో ఆదివారం బీజేపీ గుర్తు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఫొటోతో కూడిన టీషర్ట్‌లు, విసన కర్రలు పంపిణీ చేసి ఎన్నికల నియమావళిని అతిక్రమించారు. రోడ్లపైనే కౌంటర్ ఏర్పాటు చేసి మరీ టీ షర్టులను పంపిణీ చేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. సదరు బీజేపీ నాయకుల తీరుపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో అక్కడికి వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వారిని అక్కడి నుండి వెళ్లగొట్టారు తప్ప, వారి నుంచి సామగ్రిని స్వాధీనం చేసుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

## మాడుగులలో టీడీపీకి ఎదురుదెబ్బ



పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- 13 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

**మాడుగుల:** వీరనారాయణం గ్రామానికి చెందిన 13 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం తారువలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారపు రామారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ దాడి జగన్‌ల ఆధ్వర్యంలో పెంటకోట అంజి, దాడి ప్రేమకుమార్, పీలా వెంకటరావు, పీలా భాస్కరరావు, మణికంత, దాడి అప్పారావు, ఎం. వెంకటకుమార్, భీశెట్టి ముత్యాలనాయుడు, మరో ఐదు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ చేరాయి. వీరంతా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతోపాటు బూడి ముత్యాలనాయుడు సేవలను గుర్తించి పార్టీలో చేరామన్నారు. మాజీ సర్పంచ్ తూరుబిల్లి సత్తింబాబు, దాసరి రాజు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందాం


చైర్మన్ పురుషోత్తంను సన్మానిస్తున్న డైరెక్టర్ అర్జున్ వెంకట్రావు, శాలివాహన ప్రతినిధులు

నర్సీపట్నం: శాలివాహన కుమ్మరుల సంక్షేమానికి కృషి చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుందామని ఏపీ శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం పిలుపునిచ్చారు. శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ అర్జున్‌వెంకట్రావు ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఆత్మీయ సమావేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన పురుషోత్తం మాట్లాడుతూ శాలివాహన కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సీఎం జగన్ తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 6 లక్షల మందికి రూ.1,680 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మనకు తగిన గుర్తింపు ఇచ్చిన జగన్‌ను సీఎంను చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 353 మంది హాజరు


తేగాడ మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ శామ్యూల్

కశింకోట : తేగాడ వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో చేరడానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షను రాష్ట్ర పరిశీలకుడు ఎం.ఆర్.ఎ శామ్యూల్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షకు 417 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 353 మంది పరీక్షకు హాజరయ్యారు. సూపరింటెండెంట్‌గా ఐ.మార్తా తిలకం, డిపార్టుమెంట్ అధికారిగా ఎంఈవో కె.చిట్టిబాబు వ్యవహరించారు. పరీక్ష సందర్భంగా వైద్య సేవలందించడానికి ఆరోగ్య సిబ్బంది సేవలందించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


జగనంత ఆనందం


అదిగో జగనన్న..


సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు


సీఎం జగన్ కోసం ఎదురు చూస్తున్న జనం

# విశాఖ నగరి.. అభిమాన ఝరి

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విశాఖ నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వాడవాడలా జనం నీరాజనం పలికారు. దారి పొడవునా ఘన స్వాగతం చెప్పారు. సంక్షేమాభివృద్ధి విధాతా.. జయహో అంటూ నినదించారు. సబ్బవరం మండలంలోని చిన్నయ్యపాలెం నుంచి జనజాతర ప్రారంభమై.. విశాఖ నడిబొడ్డుకు చేరే కొద్దీ సముద్రంలా ఉప్పొంగింది. జై జగన్ నామస్మరణతో మార్మోగింది.


వేపగుంట జంక్షన్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి పరవశించిన ప్రజలు

### వినతులు.. భరోసా

అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురు సహాయం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఇసుకతోట కూడలి వద్ద వినతి పత్రాలు అందజేశారు. పరిశీలించి సహకారం అందిస్తామని వారికి సీఎం భరోసా ఇచ్చారు. ఎంవీపీ కాలనీకి చెందిన పి.శివకుమార్‌కు కిడ్నీ మార్పిడి జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.

- గోపాలపట్నంలో ఉంటున్న గండెం ధర్మరాజు పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయనకు మెరుగైన వైద్యం కోసం సహకారం అందించాలని కుటుంబ సభ్యులు విన్నవించుకున్నారు.
- పండిట్ల జశ్వంత్(16) కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని, అందుకు ఆర్థిక సహాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.
- పి.దక్షిత(17)కు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగిందని, మరో ఆపరేషన్ చేయాల్సి ఉందని, సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.
- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం చేయాలని పార్వతమ్మ(50) అనే మహిళ వినతి పత్రం అందజేశారు.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్న ప్రయాణికులు

### సీఎం జగన్ గొప్ప నేత



మాది విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం. ఉపాధి నిమిత్తం సబ్బవరంలోని ఓ స్వీట్ దుకాణంలో పని చేస్తున్నాను. మా కుమార్తె హరిత చర్మ వ్యాధితో బాధపడుతోంది. గత నెల 7న అనకాపల్లి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్య వివరించాం. ఆయన చాలా సానుకూలంగా స్పందించి మాకు భరోసా ఇచ్చారు. పాపకు వైద్యం చేయించడంతో పాటు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ ఆనందంతో సబ్బవరం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు పాపతో కలిసి మళ్లీ వచ్చాను. దీంతో సీఎం గారు మమ్మల్ని గుర్తించి పాపను దగ్గరికి తీసుకుని భరోసా కల్పించారు. అనకాపల్లి డీఆర్వోకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన గొప్ప మానవత్వం ఉన్న నేత. ఆయనకు రుణపడి ఉంటాం.

– ఇదదాసరి కృష్ణ, సబ్బవరం


జై జగన్.. జోహార్ వైఎస్సార్


అమ్మ ఒడి ప్రదాతకు జేజేలు


సీఎం జగన్‌కు హారతి ఇస్తున్న మహిళలు


జగనన్న జాతరలో సాంస్కృతిక సంబరం


భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చినందుకు థ్యాంక్యూ సీఎం సార్...



## లచ్చన్నపాలెంలో హీరో సాయిరాం ప్రచారం


లచ్చన్నపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న హీరో సాయిరాంశంకర్

మాకవరపాలెం: మండలంలోని లచ్చన్నపాలెంలో సినీహీరో, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సోదరుడు సాయిరాంశంకర్ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం నిర్వహించేందుకు ఆదివారం రాత్రి వచ్చిన ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. స్థానిక నేతలు పోతల వెంకునాయుడు, సర్వేశ్వరరావు, బొడ్డు నాయుడు, సాంబమూర్తితో కలసి ప్రచారం చేపట్టిన సాయిరాంశంకర్‌కు ప్రతి ఇంటివద్ద మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. సీఎం ఆశీస్సులతో నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే గణేష్‌ను మళ్లీ గెలిపించాలని అభ్యర్థించారు. అభివృద్ధి పనుల వివరాలతో ముద్రించిన పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ రమణ, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నూరు నాయుడు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి నామినేషన్ నేడు

- స్వగ్రామం తారువ నుంచి భారీ ర్యాలీగా అనకాపల్లికి పయనం



దేవరాపల్లి : అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సోమవారం నామినేషన్ వేయనున్నారు. అతని స్వగ్రామం తారువ నుంచి ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీ నడుమ బయలుదేరి అనకాపల్లి చేరుకుంటారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముహూర్తం ప్రకారం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారు. ఆయనకు మద్దతుగా మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి భారీగా తరలివెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. భారీ బైక్ ర్యాలీతో సంఘీభావం తెలిపేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సన్నద్ధమవుతున్నారు. మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండలాల్లోని ప్రతి గ్రామం నుంచి బైక్‌లతో పాటు కార్లు, ఆటోల్లో సైతం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లేందుకు ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**రింగురోడ్డు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా...**

అనకాపల్లి : ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మండలంలో శంకరం పంచాయతీ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ కార్యక్రమం సోమవారం జరుగుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీ ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. పట్టణంలో కార్పొరేటర్లు, వివిధ దేవాలయాల చైర్మన్లు, వివిధ అనుబంధ సంఘాల కమిటీలు, మండలంలో ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ భారీ బైక్, కారు ర్యాలీ నిర్వహిస్తామని, రైల్వేస్టేషన్, రామచంద్ర థియేటర్, నెహ్రూచౌక్, వేల్పులవీధి జంక్షన్, రింగ్‌రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లడం జరుగుతుందని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


ధర్మిరెడ్డి శ్రీను(ఫైల్)

అచ్యుతాపురం: మండలంలోని రామన్నపాలెంకు చెందిన ధర్మిరెడ్డి శ్రీను(42) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందాడు. సీఐ బుచ్చిరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మిరెడ్డి శ్రీను తన ఇంటి ముందు గల రేకుల షెడ్‌కు విద్యుత్ వైర్లు అమరుస్తుండగా షాక్‌కు గురయ్యాడు. అతనిని వెంటనే అచ్యుతాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి శ్రీను మృతి చెందినట్టు నిర్ధారించారని సీఐ చెప్పారు. శ్రీనుకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను మృతితో రామన్నపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన తంతడి జనసేన,టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కన్నబాబు రాజు


వైఎస్సార్ సీపీలోకి చేరిన కొండకర్ల ఎస్సీ కాలనీ వాసులు


ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన పార్టీ నాయకులు

అచ్యుతాపురం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్ సీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. టీడీపీ, జనసేనల నుంచి పలువురు కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. తాజాగా ఆదివారం తంతడి, పూడిమడక, గొర్లి ధర్మవరం, కొండకర్ల పంచాయతీల్లోని టీడీపీ, జనసేనలకు చెందిన పలు కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కె.దేముడు, సీహెచ్ అప్పారావు, కె.కిరణ్‌కుమార్, వి.పైడిరాజు, కాసుబాబుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు కండువాలు వేసి, ఆహ్వానించారు. తంతిడి పంచాయతీ నుంచి ముత్యాలు, రామకృష్ణ, కె.పైడికొండ, కె.కొండయ్య, కె.నాగరాజు, ఎస్.రామ్‌చరణ్ నాయుడు, సీహెచ్ మసేస్, కె.బాలయ్య, సీహెచ్ చంటి తదితరులు, పూడిమడక పంచాయతీ శివారు కడపాలెంకు చెందిన మైలపల్లి పోలయ్య, పెద్ద ఎర్రయ్య, ముత్యాలు, రాజబాబు, ప్రవీణ్, మల్లికార్జున్‌రావు, గొర్లె ధర్మవరం పంచాయతీ నుంచి నానేపల్లి సన్యాసినాయుడు తదితరులు, కొండకర్ల ఎస్సీ కాలనీకి చెందిన గుబ్బల అప్పారావు,కొరకుల నూకాలమ్మ,దిమ్మల లక్ష్మి,రెల్లి సరస్వతి,గుబ్బల అప్పలకొండ,కొరకు బాలమ్మ, నాగమణ, సుబ్బారావులు వైఎస్సార్ సీపీలోకి చేరారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, సుంకర జగ్గు, ఎంపీటీసీ శ్రీను,కట్టమూరి అప్పారావు పాల్గొన్నారు.

**జనసేన నుంచి...**

కోటవురట్ల: రామచంద్రపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు వైఎస్సార్ సీపీ నాయకుడు పులిచంటి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు సమక్షంలో చేరారు. అడ్డురోడ్డులోని జరిగిన కార్యక్రమంలో జోగులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు నచ్చి పలువురు చేరుతున్నారన్నారు. పార్టీలోకి చేరిన జనసేన గ్రామ అధ్యక్షుడు దాసర నాగేంద్ర, మాజీ గ్రామ అధ్యక్షుడు కొండా శ్రీను, పార్టీ నాయకులు ప్రసాదుల భీమరాజు తదితరులు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సొంత అజెండా లేదన్నారు. చంద్రబాబును సీఎంగా చేయాలనే పవన్‌కల్యాణ్ ఆలోచిస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేస్తున్నారని అందుకే వైఎస్సార్ సీపీలోకి చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, ఎస్సీసెల్ జోన్-1 ఇన్‌చార్జ్ కంబాల సందీప్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ జోన్ పార్టీ నాయకులు శ్రీపతిరాజు, చిన్న , పులి చంటి పాల్గొన్నారు.

## వివాహిత బలవన్మరణం

- కత్తితో గొంతు కోసుకుని మృతి
- మనస్పర్థల కారణంగా భర్తకు దూరం
- ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- మృతురాలు ఉమాదేవి తాటిపూడి ఏపీఆర్‌జేసీలో లెక్చరర్



గుత్తికొండ ఉమాదేవి (ఫైల్)

అనకాపల్లి: కత్తితో గొంతు కోసుకుని వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. మనస్తాపం వల్లే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. మండలంలో కొత్తూరు పంచాయతీ ముత్రాస్ కాలనీకి చెందిన గుత్తికొండ ఉమాదేవి విజయనగరం జిల్లా తాటిపూడి ఏపీఆర్‌జేసీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఆమె అనకాపల్లి నుంచి విధులకు వెళ్లి వస్తున్నారు. ఈమెకు 2011లో ముత్రాసు కాలనీకి చెందిన ఆర్మీ ఉద్యోగితో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఇది జరిగిన కొన్నాళ్లకు మనస్పర్థల కారణంగా వారిద్దరు విడిపోయారు. అప్పటినుంచి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె కత్తితో గొంతుకోసుకుని మృతి చెందింది. దీనిపై మృతురాలు ఉమాదేవి తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడోవరోజు ఆదివారం స్వామివారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

## రైవాడ జలాశయంలో అడవి దున్న మృతి


అడవి దున్న కళేబరం

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో నీట మునిగి ఓ అడవి దున్న మృతిచెందింది. ఈవిషయాన్ని ఆదివారం జలాశయానికి వచ్చిన సందర్శకులు గమనించి స్థానికులకు తెలియజేశారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక జలాశయంలో నీటిని తాగేందుకు వచ్చి ప్రమాదవశాత్తు మృతిచెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అడవి దున్న మృతి చెందిన విషయం తెలుసుకుని పలువురు ప్రజలు జలాశయం వద్దకు చేరుకున్నారు. అటవీశాఖ అధికార్లు దీనిని బయటకు తీయాల్సి ఉంది. ఇలాఉండగా ఈ మధ్యకాలంలో జలాశయం పరిసరాలలో అడవి దున్నల సంచారం అధికంగా ఉందని పశువుల కాపరులు తెలిపారు.

## క్లుప్తంగా

### ఎంపీ అభ్యర్థి బూడి నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

కశింకోట: వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సోమవారం దాఖలు చేయనున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే ర్యాలీలో పాల్గొనేందుకు మండలం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, స్థానిక ప్రజా ప్రతినిధులు భారీగా తరలిరావాలని పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు కోరారు. అనకాపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో కార్లు, బైక్‌లపై భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, డి-1 సెక్షన్ ఏఈ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ గాంధీనగరం, విజయరామరాజుపేట ఏరియాల్లో, 9 నుంచి ఒంటిగంట వరకూ లక్ష్మీదేవిపేట, ఏఎంపీ కాలనీ, పూడిమడక రహదారి, ఉమ్మలాడ జంక్షన్, శారదాకాలనీ, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు వారు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ ఉద్యోగులకు సహకరించాలని కోరారు.

### ప్రశాంతంగా పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష



పాటిపల్లి మోడల్ స్కూల్‌లో పరిశీలిస్తున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు శామ్యూల్

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా 5వతరగతి పూర్తి చేసుకొని ఆరవ తరగతిలో ప్రవేశించేందుకు 289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 244 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న తీరును రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు ఎం.ఆర్.ఎ శామ్యూల్ పరిశీలించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో వేణుగోపాలరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

### ఎండ దెబ్బకు విలవిల

రాంబిల్లి : ఎండ దెబ్బకు మండలవాసులు విలవిలలాడారు. ఆదివారం భానుడు భగభగలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు దుకాణాలు తెరవ లేదు. ఎండ తీవ్రతకు రైతులు , కూలీలు మరింత ఇబ్బంది పడ్డారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. దీంతో ప్రజలు కాస్త సేద తీరారు.

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మార్కెట్ మహాలక్ష్మి | : రాజా |
| పారిజాత పర్వం | : సత్యనారాయణస్క్రీన్-1 |
| టెనెంట్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| గీతాంజలి | : షిర్డీసాయి |
| ఫ్యామిలీ స్టార్ | : పర్తిసాయి |
| మంజుమ్మల్ బోయ్స్ | : వెంకటేశ్వర |
| గుంటూరు కారం ( 2 షోలు) | : శ్రీసత్య |
| హ్యాపీడేస్(2 షోలు) | : శ్రీసత్య |
| డీజే టిల్లు-2 | : రామచంద్ర |

## రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 70 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-10 యూనిట్లు, బి పాజిటివ్-23 యూనిట్లు, ఒ పాజిటివ్-36 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706) సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 222 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ను సంప్రదించవచ్చు.






వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో విసన్నపేట రూపురేఖలు మారిపోయాయి. మౌలిక వసతులు సమకూరాయి. డిజిటల్ లైబ్రరీతో పాటు పలు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. రోడ్లు నిర్మించడంతో పాటు నీటి సదుపాయం కల్పించారు. నాడు-నేడులో పాఠశాలలను అభివృద్ధి చేశారు. దీంతో గ్రామం నూతన శోభను సంతరించుకుంది.

# విసన్నపేట... ప్రగతి బాట


బయ్యవరం-రామన్న పాలెం గ్రామాల మధ్య కొండగెడ్డపై నిర్మించిన వంతెన

ఐదేళ్ల జగనన్న పాలనలో ఎంతో అభివృద్ధి


రామన్నపాలెంలో నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల


గెడ్డపై నిర్మించిన మదుం


జగనన్న కాలనీ

| | |
|---|---|
| మండలం | : కశింకోట |
| పంచాయతీ | : విసన్నపేట |
| శివారు గ్రామం | : రామన్నపాలెం |
| జనాభా | : 2,200 మంది |

కశింకోట: మండలంలో మారుమూలన ఉన్న విసన్నపేట పంచాయతీ గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చెందింది. సుమారు రూ.3.40 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారు. మారుమూలన ఉన్న శివారు రామన్నపాలెం గ్రామానికి రూ.2 కోట్లు వెచ్చించి వంతెన నిర్మించారు. అంతర్గత సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం జరిగింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని విసన్నపేట గ్రామ పంచాయతీలో సుమారు 2,200 మంది జనాభా ఉన్నారు. జమాదులపాలెం సచివాలయం పరిధిలో ఈ గ్రామం ఉంది. సైనికుల గ్రామంగా పేరొందింది. దాదాపు ఇంటికొకరు చొప్పున సైనికులు ఉంటారు. ఆర్మీ నుంచి రిటైర్ అయి వచ్చిన వారు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. రామన్న పాలెం శివారు గ్రామంగా ఉంది. ఇక్కడ గత ఐదేళ్లలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. రూ.25 లక్షల వ్యయంతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించారు. రూ.20 లక్షలు వెచ్చించి అర కిలో మీటరు పైగా గ్రామంతో పాటు ప్రధానంగా పొలాలకు వెళ్లడానికి సిమెంట్ రోడ్డు నిర్మించారు. రూ.6 లక్షలతో మురికి కాలువలు నిర్మించారు. దీంతో సౌకర్యాలు మెరుగుపడ్డాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రసిద్ధి చెందిన పడమటమ్మ లోవ దర్శనానికి వచ్చే భక్తుల కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసి రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. రూ.5 లక్షలతో పొలాలకు వెళ్లడానికి గెడ్డపై మదుం నిర్మించారు. వైఎస్సార్ గృహ నిర్మాణ పథకంలో 19 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో వాటిని నిర్మించుకుంటున్నారు. రూ.12 లక్షలతో పాఠశాలను నాడు-నేడులో అభివృద్ధి చేశారు. రూ.16 లక్షలతో డిజిటల్ లైబ్రేరీ భవనం నిర్మాణం జరుగుతోంది. శ్లాబ్ వేశారు. గ్రామంలో తాగు నీటి ఎద్దడి నివారణకు మూడు బోర్లు ఏర్పాటు చేశారు.


నాడు-నేడులో అభివృద్ధి చేసిన మైదానం


విసన్నపేటలో పొలాలకు నిర్మించిన సిమెంట్ రోడ్డు

**చిన్న గ్రామానికి భారీ వంతెన**

శివారు గ్రామం రామన్నపాలెంకు రూ.2 కోట్లతో భారీ వంతెన నిర్మించారు. ఇక్కడ గతంలో నిర్మించిన వంతెన కొండగెడ్డ ప్రవాహానికి 2017లో కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలికంగా అప్పట్లో కాజ్‌వే నిర్మించారు. ఏ మాత్రం వర్షం పడినా కొండగెడ్డ పొంగి కాజ్‌వేపై ప్రవహించడంతో ప్రజలు రాకపోకలు నిలిచిపోయి ఇబ్బంది పడేవారు. దీంతో వంతెన నిర్మించాలని ప్రజలు చాలా కాలంగా కోరుతూ వచ్చారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం విశాఖ జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం తరఫున రూ. రెండు కోట్ల వ్యయంతో భారీ వంతెన నిర్మించారు. దీంతో రాకపోకలు సదుపాయం మెరుగుపడింది. ఈ గ్రామంలో రూ.5.60 లక్షల వ్యయంతో కాలువలు నిర్మించడంతో పాటు, నాడు-నేడులో రూ.18 లక్షలతో అందంగా స్కూలును అభివృద్ధి చేశారు. రూ.5 లక్షలతో రెండు మదుంలు నిర్మించారు.

**అభివృద్ధి ఇలా**

| చేపట్టిన పనులు | విలువ రూ.లలో |
|---|---|
| విసన్నపేటలో అంతర్గత సిమెంట్ రోడ్లు, కాలువల | 25 లక్షలు |
| పడమటమ్మ లోవలో రక్షిత మంచినీటి పథకం | 10 లక్షలు |
| మురికి కాలువలు | 6 లక్షలు |
| డిజిటల్ లైబ్రరీ | 16 లక్షలు |
| రామన్నపాలెం వంతెన | 2 కోట్లు |
| నాడు-నేడులో విసన్నపేట స్కూలు అభివృద్ధి | 12 లక్షలు |
| నాడు-నేడులో రామన్నపాలెం స్కూలు అభివృద్ధి | 18 లక్షలు |
| మురికి కాలువ | 5.60 లక్షలు |
| రామన్నపాలెంలో మదుములు | 5 లక్షలు |

### ఇబ్బందులు తొలగాయి


కొండగెడ్డపై వంతెన లేకపోవడంతో బయ్యవరం నుంచి రామన్నపాలెం వెళ్లడానికి ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బంది పడేవారం. ఏ మాత్రం వర్షం పడినా కాజ్‌వే నీట మునిగేది. దీంతో రాకపోకలు బంద్ అయ్యేవి. రెండేళ్లక్రితం రూ.2 కోట్లతో వంతెన నిర్మించారు. దీంతో తమకు కొండగెడ్డ ఇబ్బంది తొలగింది. ఎంతో ఆనందంగా ఉంది.

– భరణికాన గోవింద్, కూలీ, విసన్నపేట శివారు రామన్నపాలెం

### పొలాలకు రోడ్డు


మా పొలాలకు గతంలో మట్టి రోడ్డు ఉండేది. వర్షం పడిందంటే బురదమయంగా మారేది. దీంతో చాలా ఇబ్బంది పడేవారం. రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. రహదారి సదుపాయం మెరుగుపడింది, వ్యవసాయ కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉంది.

– పెంటకోట రాము, రైతు , విసన్నపేట

### తొలగిన మురుగు ఇబ్బందులు


మురికి కాలువలు లేక ఇబ్బంది పడేవారం. మురికి నీరు రోడ్డుపైనే నిలిచిపోయేది. ఇటీవల డ్రైనేజీలు నిర్మించారు. ఇప్పుడు ఇబ్బంది తొలగింది.

– నడిశెట్టి లక్ష్మి, విసన్నపేట

### విద్యాప్రమాణాలు మెరుగు


నాడు-నేడులో రామన్నపాలెం పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు. సదుపాయాలు మెరుగుపడ్డాయి. విద్యార్థులు చదువుకోవడానికి కావలసిన సామగ్రి ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

-కరక పరమేశ్వరరావు, రామన్నపాలెం.

## తాకాశివీధి నూకాంబికకు ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ పూజలు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, నివేదిత దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ అమ్మవారి నెల పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అంతకు ముందు అమ్మవారికి భరత్‌కుమార్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. భరత్‌కుమార్‌ను ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, ట్రస్ట్‌బోర్డు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


భరత్‌కుమార్‌ను దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న రాజేష్

## నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు


అమ్మవారి ఆలయంలో భక్తులు


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న మహిళలు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర రెండో ఆదివారం సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూకాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయం వద్ద రహదారిపై భక్తులు బారులుతీరారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు.

పట్టణ, ట్రాఫిక్ సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయం ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## మరిడిమహాలక్ష్మి ఉత్సవ ఏర్పాట్లు


మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


అబిడ్ సెంటర్‌లో అమ్మవారి హోర్డింగ్

నర్సీపట్నం: పట్టణ ప్రజల ఇలవేల్పు మరిడిమహాలక్ష్మి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి మూడేళ్లకొకసారి అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 23న అమ్మవారి పండగ జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పెద్ద ఎత్తున విద్యుత్ అలంకరణ చేశారు. అబిడ్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి నిలువెత్తు హోర్డింగ్ ప్రత్యేక అకర్షణగా నిలిచింది. ఆదివారం ఇక్కడ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం


మూలపేట గంగాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి దాతలు తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఆదివారం గంగాదేవిపేటకు చెందిన ఆడారి అప్పారావు కుమారుడు శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతులు రూ.10,216 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మూలపేట సర్పంచ్ గంగప్పల నాయుడు కోరారు.

## బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పాలి

అనకాపల్లి: కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని, ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన అఖిలభారత తపాల, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం తొమ్మిదవ వార్షిక మహాజన సభలో ఆయన మాట్లాడారు.

మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

**నూతన కార్యవర్గం ఎన్నిక**

తపాల ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్.సూర్యనారాయణ, కార్యదర్శిగా కె.రాజారావు, కోశాధికారిగా టి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### చివరి దశకు వరి నూర్పులు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో వరి నూర్పులు పనులు చివరి దశకు చేరుకున్నాయి. మండలంలో వరి నూర్పులు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నూర్పులు పనులు దాదాపు పూర్తయ్యాయి.

మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి 9వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. వాతావరణం అనుకూలించడం , శారద నదిలో నీరు పుష్కలంగా ప్రవహించడంతో పంట బాగా పండింది. అంతేగాక దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పాటు ధర కూడా గత ఏడాదితో పోలిస్తే బస్తాకు రూ 300 అదనంగా పలుకుతుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కన్నబాబు మళ్లీ గెలవాలని పాదయాత్ర

యలమంచిలి రూరల్ : యలమంచిలి ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు) నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికల్లో గెలవాలని ఆకాంక్షిస్తూ యలమంచిలి పట్టణం కాకివానివీధికి చెందిన పక్కుర్తి శంకర్, ధర్మవరం వీధికి చెందిన కొఠారు నాగేశ్వర్రావు ఆదివారం యలమంచిలి నుంచి కశింకోట కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేశారు. కన్నబాబురాజు దుర్గమ్మ ఆశీస్సులతో నాలుగోసారి కూడా తప్పకుండా ఎమ్మెల్యేగా గెలవాలన్నదే తన బలమైన కోరికగా వారిద్దరూ చెప్పారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుని సుమారు 20 కిలోమీటర్లు నడిచి వెళ్లి అమ్మవారికి తమ కోరికను చెప్పుకున్నట్టు వారు తెలిపారు. పాదయాత్ర చేసిన పక్కుర్తి శంకర్ పట్టణంలో 8వ వార్డు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.


కశింకోట కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న పక్కుర్తి శంకర్, కొఠారు నాగేశ్వర్రావు

## పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన వచ్చింది. ఉచిత కోచింగ్ సెంటర్ విద్యార్థులతో పాటు జిల్లా స్థాయి పలు పాఠశాలల నుంచి 117 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనట్టు నిర్వాహకులు పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షకు అవసరమైన మోడల్ టెస్ట్ పేపర్స్ వింగ్స్ ఫౌండేషన్ సభ్యుడు ముద్రించినట్టు తెలిపారు. ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించిన అతి తక్కువ రోజుల్లోనే జిల్లా స్థాయిలో మోడల్ టెస్ట్ నిర్వహించడం పట్ల పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ అభినందనలు తెలిపారు.


పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

### మోదకొండమ్మ పంచలోహ విగ్రహం ఏర్పాటు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో మోదకొండమ్మ పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని గ్రామానికి చెందిన అనపగడ్డ శ్రీనివాసరావు, సాయిలక్ష్మి దంపతులు రూ.40 వేలతో తయారు చేయించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అమ్మవారి ఘటాలతో పంచలోహ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రతిష్ఠించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, శ్రీనాథు చిన్నారావు, అప్పాన భాస్కరరావు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కాంతి కుమార్

నర్సీపట్నం: పట్టణంలోని రౌడీషీటర్లకు టౌన్ సీఐ కాంతికుమార్ ఆదివారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తే పీడీ యాక్టు తెరుస్తామని హెచ్చరించారు. ఎన్నికలే కాకుండా పట్టణంలో ప్రస్తుతం మరిడిమాంబ పండగలో ఎక్కడైనా ఎవరితోనైనా గొడవలకు దిగితే శిక్షార్హులు అవుతారన్నారు. ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## సరుగుడు జలపాతం వద్ద సందడి

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. మండు వేసవిలోనూ ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడేందుకు పోటీ పడ్డారు. ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు సైతం ఇక్కడ జలపాతం చూసేందుకు తరలివచ్చారు. ఉదయం నుంచి స్నానాలు చేసి ఆటపాటలతో సాయంత్రం వరకు సందడి చేశారు. మండలంలో చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోగా, ఇక్కడ మాత్రం నీటి ప్రవాహం తగ్గకపోవడం విశేషం.


జలపాతం వద్ద సందర్శకులు